## క్లుప్తంగా

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఏటూరునాగారం : మండల కేంద్రానికి చెందిన నలుగురికి బుధవారం సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులు పంపిణీ చేసినట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు తెలిపారు. బట్టు ప్రశాంత్‌కు రూ.45,000, సమ్మిరెడ్డికి రూ.49,000, ఇర్సవడ్ల నిహారికకు రూ.21వేలు, చింత సుజాతకు రూ. 22వేల విలువగల చెక్కులు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయూబ్, గుడ్ల దేవేందర్, లాలయ్య, ఖలీల్, నర్సింహరావు, ఎల్లయ్య, రంజిత్, తరుణ్, సాయి, గోపాల్, ముత్తేష్, కిరణ్ పాల్గొన్నారు.

### గుడుంబా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



కన్నాయిగూడెం : అక్రమంగా గుడుంబా తరలిస్తున్న ఓ వ్యక్తిని బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాలు.. మంగళవారం రాత్రి మండలంలో పెట్రోలింగ్ చేస్తుండగా బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కావిరి అంజన్‌రావు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి అక్రమంగా 180 లీటర్ల గుడుంబాను తీసుకువస్తున్నాడు. కన్నాయిగూడెం శివారులోని సబ్ స్టేషన్ వద్ద అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులో తీసుకోని విచారించగా గుడుంబా బస్తాలు పట్టుబడినట్లు తెలిపారు. దీంతో అంజన్‌రావు పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

### పరామర్శ



ములుగు రూరల్ : మండలంలోని సర్వాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పసుల నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు జిల్లా నాయకుడు బాదం ప్రవీణ్‌కుమార్ పరామర్శించి, ఓదార్చారు. నర్సయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుక్కల నాగరాజు, నాయకులు తదితరులు ఉన్నారు.

### పంచాయతీ రికార్డుల తనిఖీ



వెంకటాపురం(ఎం) : మండలంలోని ఆయా గ్రామాల్లోని సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి సీహెచ్.రవీందర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. బుధవారం మండలంలోని లక్ష్మీదేవిపేట, నర్సింగాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తూ పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి



ఏటూరునాగారం : స్వయం ఉపాధితో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఫ్యాకల్టీ పరికి కిశోర్‌బాబు సూచించారు. మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయ ఫంక్షన్ హాల్‌లో శిక్షణ సంస్థ డైరెక్టర్ బాస రవి, ఆలయ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం 70మంది మహిళలకు ఉచితంగా మగ్గం వర్క్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈనెల 13 నుంచి 35 మంది మహిళలకు మొదటి బ్యాచ్, 14 నుంచి 35 మందికి రెండో బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభం అవుతాయన్నారు. ఉచిత శిక్షణతోపాటు మధ్యాహ్న భోజనం, మగ్గం వర్క్ ట్రెయినింగ్ మెటీరియల్‌ను కూడా ఇస్తామన్నారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు కూడా అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పెండ్యాల ప్రభాకర్, స్వయం ఉపాధి శిక్షణ ఆఫీస్ సిబ్బంది కుమార్, నర్సింహచారి, బచ్చు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాలకు పొంగుతున్న వాగులు



రహదారిపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



ఉధృతంగా ప్రవహిస్తున్న కొంగాల వాగు

వాజేడు : మండలంలో మంగళవారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పంట పొలాలు నీట మునగడంతో పాటు రహదారులపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది. కొంగ వాగు, బొమ్మనపల్లి వాగు, మర్రిమాగు వాగు, అలుగొర్రె, చాకలి వాగు, ముష్టి వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రగళ్లపల్లి గ్రామ పంచాయతీ ఎస్సీ కాలనీ సమీపంలో వర్షపు నీరు వాజేడు, భద్రాచలం రహదారిపై నుంచి ప్రవహించింది. వర్షపు నీరు తూములపై నుంచి ప్రవహిస్తుందనే సమాచారాన్ని పంచాయతీ సెక్రటరీ కార్తీక్ ద్వారా తెలుసుకున్న అధికారులు స్థానిక ప్రజలను అప్రమత్తం చేశారు.

### ముంపు ప్రాంతాల్లో సందర్శన



స్థానికులతో మాట్లాడుతున్న పస్రా ఎస్సై

గోవిందరావుపేట : మండల పరిధిలోని లక్నవరం సరస్సు మత్తడి పోస్తుండగా వరద ముంపు ప్రభావిత ప్రాంతాలను పస్రా ఎస్సై కమలాకర్ సందర్శించారు. ముంపునకు గురయ్యే విల్సన్ కాలనీ ప్రజలను అప్రమత్తం చేసేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఎస్సై బుధవారం సందర్శించారు. లక్నవరం చెరువు ఉధృతి పెరిగితే ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో కాలనీ వాసులకు సూచించారు. ఏదైనా అనుకొని ప్రమాదం జరిగితే వెంటనే పోలీసులకు, సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న వారు వర్ష తీవ్రతను బట్టి వరద తాకిడిని అంచనా వేస్తూ ఉధృతి పెరిగితే ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పేర్కొన్నారు.

## ‘గీత’ సంక్షేమానికి నిధులు కేటాయించాలి



నినాదాలు చేస్తున్న కల్లుగీత కార్మికులు

ములుగు రూరల్ : గీతవృత్తి సంక్షేమానికి రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలని కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పులి నర్సయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు ముస్నిపల్లి కుమార్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ములుగు మండలంలోని జంగాలపల్లిలో జనగాం శ్రీనివాస్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. తాడి కార్పొరేషన్ తరఫున తాటి చెట్ల పైనుంచి పడిన బాధితులకు అందిస్తున్న సాయాన్ని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు, ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి ఇస్తున్న ఆర్థికసాయాన్ని రూ.25వేల నుంచి రూ.50 వేలకు పెంచాలని కోరారు. అలాగే తాటిచెట్లు ఎక్కే ప్రతి గీత కార్మికుడికి మోకు ఇవ్వాలని, గీత కార్మికులకు అడ్డంకిగా ఉన్న మెడికల్ బోర్డును తక్షణమే రద్దు చేయాలన్నారు. ఈ నెల 18వ తేదీన నిర్వహించ తలపెట్టిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు కునూరు అశోక్, పులి రవి, ముస్నిపల్లి భిక్షపతి, బొడిగే భిక్షపతి, పులి శ్రీనివాస్, దూలం శ్రీనివాస్, బీమగాని ఆనంద్, వీరగోని భాస్కర్, గట్టు యాదగిరి, నాగపూరి సదయ్య, వేముల రవి, బొడిగే శ్యాం, కాసగాని సంపత్‌తో పాటు 30మంది గీత కార్మికులు పాల్గొన్నారు.

# వాగ్దానాల అమలులో ఉదాసీనత

● సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె) : వాగ్దానాల అమలులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీన వైఖరిని అవలంభిస్తున్నాయని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట మల్లికార్జున్ ఆరోపించారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన మండల మహాసభ నూతన కమిటీ నిర్మాణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాగా 11 మందితో మండల కార్యవర్గాన్ని, 29 మందితో కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన మండల కార్యదర్శి కట్ల రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మల్లికార్జున్ మాట్లాడారు. నిరుపేదలకు రేషన్ బియ్యం సక్రమంగా అందడంలేదని, పట్టాదారు పాస్‌పుస్తకాల జారీలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇళ్ల స్థలాలు ఉన్న ఎస్సీ, ఎస్టీలకు రూ. 6లక్షల చొప్పున, మిగతా కులాలకు రూ.5 లక్షల చొప్పున అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, రాత్రి సమయాల్లో దోమల మందు ఫాగింగ్ చేయాలని కోరారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గడ్డం రామకృష్ణ, బొల్లి వెంకటలక్ష్మి, రమేష్, సత్యం, ముత్తయ్య, గోపాల్, కొండయ్య, గోపి, నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీజ



గోవిందరావుపేట పీహెచ్‌సీని పరిశీలిస్తున్న శ్రీజ

ములుగు: అమ్మ ఆదర్శ పాఠశాలల పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) శ్రీజ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగపేట, కన్నాయిగూడెం మండలాల్లోని అమ్మ ఆదర్శ పాఠశాల పనుల ప్రగతిపై విద్యాశాఖ అధికారి పాణిని సమక్షంలో బుధవారం పాఠశాలల వారీగా సమీక్ష చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ పాఠశాలకు కేటాయించిన నిధులు, మంజూరైన పనుల ప్రగతిపై సమగ్ర సమీక్ష నిర్వహించి పెండింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని సంబంధిత ఏఈ, వీవోలను ఆదేశించారు. సమగ్ర శిక్ష ప్లానింగ్ కో-ఆర్డినేటర్ అర్షం రాజు, మంగపేట, కన్నాయిగూడెం మండలాల ఏఈలు, ఎంఈఓ రాజేష్, రెండు మండలాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

**సీజనల్ వ్యాధుల నివారణకు కృషి**

గోవిందరావుపేట: పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపడుతూ సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి.శ్రీజ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం గోవిందరావుపేట, పస్రా గ్రామ పంచాయతీలలో పారిశుద్ధ్య నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం ములుగు మండలంలోని రాయినిగూడెం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. 8వ తేదీన మలేరియా, డెంగీ విషజ్వరాల వ్యాప్తిని అరికట్టేందుకు ఫాగింగ్, ఆయిల్ బాల్స్ పిచికారీ, వీధి కుక్కలను గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందని వివరించారు. ఎంపీడీఓ జవహర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## నిధులు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

గోవిందరావుపేట : చేవెళ్ల ఎస్సీ డిక్లరేషన్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, వెంటనే నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్‌కు బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడు మంగ రవి ఆధ్వర్యంలో బుధవారం వినతి పత్రం ఇచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో నిర్వహించిన ఎస్సీ డిక్లరేషన్‌లో ఇచ్చిన ప్రధాన హామీలైన అంబేద్కర్ అభ్యాసం, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి, షెడ్యూల్డ్ కులాల సాంఘిక సంక్షేమ వసతి గృహాల పునర్నిర్మాణం తదితర అంశాలను పరిగణలోకి తీసుకోకుండా రాష్ట్ర బడ్జెట్‌లో ఎలాంటి నిధులు కే టాయించలేదని బీజేపీ నాయకులు నిరసన వ్య క్తం చేశారు. మద్దినేని తేజరాజు, రుద్రారపు సురేష్ , శ్రీకాంత్, మురళి, సత్యనారాయణ రెడ్డి, రవిశంక ర్, యశ్వంత్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాచి చల్లార్చిన నీటినే తాగాలి



వెంకటాపురం(కె) : పరీక్షలు చేస్తున్న వైద్యులు

వెంకటాపురం(కె) : కాచి చల్లార్చిన నీటినే తాగాలని ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ సూచించారు. మండల పరిధిలోని రాచపల్లి, చిరుతపల్లి, మరికాల, నూగూరు, మల్లాపురం గ్రామాల్లో బుధవారం వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సోహెల్, స్నేహ, కిరణ్, సిబ్బంది జ్యోతి, కోటిరెడ్డి తదితరులు ఉన్నారు.

**వైద్యశిబిరం ఏర్పాటు చేయాలి**

వాజేడు : మండల పరిధిలోని గణపురం గ్రామంలో ప్రత్యేక వైద్యశిబిరం ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి రావు కోరారు. విషజ్వరాలు ప్రబలుతున్నాయనే విషయం తెలుసుకుని సీపీఎం బృందం గ్రామంలో పర్యటించినట్లు చెప్పారు. ఒకరిద్దరు జ్వరాలతో బాధపడుతుండగా అనేక మందికి కీళ్ల నొప్పులు, కాళ్ల వాపులు ఉన్నట్లు తెలిపారు. వెంటనే వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలను రక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు దామోదర్, ప్రవీణ్, సంతోష్, కృష్ణ, బాబు ఉన్నారు.

# కోర్టు విధుల బహిష్కరణ.. ర్యాలీ



నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

జనగామ: ఓ కేసు విషయమై మాట్లాడేందుకు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన న్యాయవాద దంపతులు అమృతరావు, కవితలపై పోలీసులు దాడి చేశారని నిరసిస్తూ జనగామ కోర్టులో రెండోరోజు బుధవారం విధులను బహిష్కరించారు. న్యాయవాదులపై దాడి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎలగందుల చంద్రరుషి ఆధ్వర్యాన అడ్వొకేట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వీరికి మద్దతుగా వరంగల్, భూపాలపల్లి, పరకాల, సిద్దిపేట, రంగారెడ్డి, సూర్యాపేట, హైదరాబాద్, మంచిర్యాల, కొత్తగూడెం జిల్లాలకు చెందిన బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వచ్చారు. ప్రముఖులు బార్ అసోసియేషన్ ప్రతినిధులతో ఉదయం, మధ్యాహ్నం చర్చలు జరిపారు. సీఐతోపాటు దాడిలో పాల్గొన్న ఎస్సై, పోలీసు సిబ్బందిని సస్పెండ్ చేసి కేసు నమోదు చేయాలని పట్టుబట్టారు. చర్చలు విఫలం కావడంతో కోర్టు ఆవరణ నుంచి ఆర్టీసీ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించగా.. పోలీసులు బందోబస్తు చేపట్టారు.

## హామీలు నెరవేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న జీపీ కార్మికులు

వెంకటాపురం(కె) : రాష్ట్ర ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని గ్రామ పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ సంఘం నాయకుడు రంజిత్ మాట్లాడారు. పంచాయతీ కార్మికుల పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేసి చెల్లించాలన్నారు. జీపీ కార్మికులను పర్మనెంట్ చేసి కనీస వేతనం అమలు చేయాలని అన్నారు. పంచాయతీ సిబ్బందిని పీఆర్‌సీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, అర్హత కలిగిన సిబ్బందిని పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు తాటి శ్రీను, మోహన్‌రావు, సుందర్‌రావు ఉన్నారు.

# మెనూ పాటించకపోతే చర్యలు



స్టాక్ రూమ్ పరిశీలిస్తున్న రమాదేవి

ఏటూరునాగారం : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని, మెనూ పాటించకపోతే చర్యలు తప్పవని జీసీడీఓ రమాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జీసీడీఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాలలో ఉన్న తరగతి గదులు, వంట గది, స్టాక్ రూమ్, వండిన ఆహారాన్ని పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. విజిటర్స్‌కు సమయ పాలన కేటాయించాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్‌ఆఫీసర్ అరుణ, టీచర్లు రమాదేవి, హరిత, కౌసల్య, రమ్యకృష్ణ, రేఖరాణి, నాగలక్ష్మి, ప్రశాంతి, అన్నపూర్ణ, స్వాతి పాల్గొన్నారు.

# పీహెచ్‌సీలో ‘స్వచ్ఛదనం-పచ్చదనం’



పిచ్చి మొక్కలను తొలగిస్తున్న అప్పయ్య

గోవిందరావుపేట : మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ అప్పయ్య ఆధ్వర్యంలో బుధవారం స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ పరిసరాను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మొక్కలు నాటి పచ్చదనం పెంపొందించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి చంద్రకాంత్, అనూష, శ్యామల, జంపయ్య, ఉమ, కవిత, స్టాఫ్ నర్సులు తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



పరుగు పందెం నిర్వహిస్తున్న అధికారులు

ఏటూరునాగారం : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలంగాణ గిరిజన గురుకులం హైదరాబాద్ స్పోర్ట్స్ ఆఫీసర్ డి.రవికుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాలలో 7, 8 తేదీల్లో 5వ తరగతి ప్రవేశాలకు బ్యాటరీ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ హాజరై మాట్లాడారు. ప్రవేశాలకు వివిధ క్రీడలు నిర్వహించి, టెస్టులు చేసిన తర్వాత విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రతిభ కనబరిస్తే సీటు దక్కుతుందన్నారు. పాఠశాలలో 80 సీట్లు ఉన్నాయని, వాటిని భర్తీ చేస్తామన్నారు. గురుకుల ప్రాంతీయ సమన్వయ అధికారి హరిసింగ్, ప్రిన్సిపాల్ డి. శ్రీనివాస్‌రెడ్డి, వివిధ పాఠశాలల పీడీలు, పీఈటీలు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# తల్లిపాలతో రోగనిరోధక శక్తి



ములుగురూరల్ : ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ములుగు రూరల్ : నవజాత శిశువుకు తల్లిపాలు పట్టిస్తే రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ కూచన శిరీష అన్నారు. కాగా బుధవారం మండలంలోని మహమ్మద్ గౌస్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ హాజరై మాట్లాడారు. తల్లిపాల ప్రాముఖ్యతను వివరించి, గర్భిణులు తీసుకోవల్సిన జాగ్రత్తలను సూచించారు.అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సీమంతం, కమ్యూనిటీ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మల్లంపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ కమరున్నిసా బేగం, అంగన్‌వాడీ టీచర్లు దేవిక, రజిత, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

**అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన**

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని పాత్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేయించారు. సీడీపీఓ ముత్తమ్మ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలని అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు విజయ, సుశంతల, సీతారత్నం ఉన్నారు.

# సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్‌రావు

ములుగు రూరల్ : సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం వల్ల నేరాల నియంత్రణకు అడ్డుకట్ట వేయొచ్చని ఎస్సై వెంకటేశ్వర్‌రావు తెలిపారు.ఈ మేరకు బుధవారం మల్లంపల్లిలో స్థానికులకు సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలు, గస్తీ, కిడ్నాప్, గుడుంబా, గంజాయి వంటి అసాంఘిక కార్యకలాపాలను పర్యవేక్షించడానికి సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు వ్యాపారులు, ప్రజలు, అధికారులు ముందుకు రావాలని ఎస్సై సూచించారు.

**సోలార్ సీసీ కెమెరాల ఏర్పాటు**

గోవిందరావుపేట : రోడ్డు ప్రమాదాల నివారణకు జాతీయ రహదారికి ఇరువైపులా బుధవారం బారికేడ్స్‌తో పాటు సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలతో గ్రామాల్లో ప్రమాదాలు, దొంగతనం చేసి తప్పించుకుపోయే వాహనాల ఆచూకిని తెలుసుకోవడానికి, గ్రామంలో జరిగే ప్రతి కదలికపై నిఘా ఉండేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు పస్రా ఎస్సై కమలాకర్ తెలిపారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు రేడియం స్టిక్కర్లు అంటించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

# ఇసుక లారీల సమస్య పట్టదా?



మంగపేట : మండలంలోని చుంచుపల్లి ఇసుక క్వారీ వద్ద లారీలతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకుడు తాటి కృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. మండలంలోని వాడగూడెం పంచాయతీ పరిధిలోని పాలాయిగూడెం వద్ద గల చుంచుపల్లి ఇసుక క్వారీ స్టాక్ యార్డు వద్ద నెలకొన్న సమస్యపై తమ పార్టీ నాయకుల బృందంతో కలిసి వాస్తవ పరిస్థితులను పరిశీలించామన్నారు. ఏటూరునాగారం బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై లారీలను నిలిపి పొక్లెయినర్‌తో ఇసుక లోడింగ్ చేయడంతో తరచుగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందన్నారు.